క్లుప్తంగా

వృద్ధాశ్రమంలో అన్నదానం



సురక్షణా వృద్ధాశ్రమంలో అన్నదానం చేస్తున్న జార్జిపాల్

మీర్‌పేట: మీర్‌పేట గాయత్రినగర్‌లోని సురక్షణా వృద్ధాశ్రమంలో ఆదివారం తెలంగాణ ప్రైవేటు ఉద్యోగ సంఘం (టీపీయూఎస్) రాష్ట్ర కార్యదర్శి యడ్ల జార్జిపాల్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా జార్జిపాల్ మాట్లాడుతూ తన వంతు బాధ్యతగా అన్నదానం చేశానని, భవిష్యత్తులోనూ వృద్ధాశ్రమానికి సహాయ, సహకారాలు అందజేస్తానన్నారు. ప్రతీ ఒక్కరూ పేదలకు సేవ చేసేందుకు ముందుకురావాలన్నారు. కార్యక్రమంలో టీపీయూఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు జి.సాయికుమార్ పాల్గొన్నారు.

'స్వచ్ఛతా హీ సేవా' ప్రారంభం



పరిసరాలను శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్న సిబ్బంది

మహేశ్వరం: మండల కేంద్రంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ఆదివారం గ్రామ పంచాయతీ అధికారులు, ప్రజాప్రతినిధులు, పంచాయతీ సిబ్బంది పరిసరాలను పరిశుభ్రం చేసి, వ్యర్థాలను తొలగించారు. వార్డుల్లోని రోడ్లు, మురికి కాల్వలను శుభ్రం చేసి దోమలు, ఈగలు వ్యాప్తి చెందకుండా రసాయనాలను పిచికారీ చేశారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తడి, పొడి చెత్తను వేరు చేసి డబ్బాల్లో వేయాలని పంచాయతీ కార్యదర్శి వజ్రలింగం తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం సత్యనారాయణ, శివగంగ ఆలయ డైరెక్టర్ కె. చంద్రయ్య, వార్డు సభ్యులు , గ్రామ పెద్దలు, గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య కార్పొరేషన్ సాధన దీక్షను విజయవంతం చేయాలి

మలక్‌పేట: తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో చేపట్టనున్న ' ఆర్యవైశ్య కార్పొరేషన్ సాధన దీక్ష' ను విజయవంతం చేయాలని మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షుడు వూరె లక్ష్మణ్ పిలుపునిచ్చారు. దిల్‌సుఖ్‌నగర్‌లోని కార్యాలయంలో ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. ఆర్థికంగా వెనుకబడిన ఆర్యవైశ్యులను ఆదుకొనేందుకు ప్రభుత్వం వెంటనే ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ నగరంలోని ఇందిర పార్కు వద్ద ఈనెల 30న సాధన దీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటలకు వరకు నిర్వహించే ఈ దీక్షలో గ్రామాలు, పట్టణాల నుంచి వేలాదిగా తరలివచ్చి దీక్షకు సంఘీభావం తెలపాలని వారు విజ్ఞప్తి చేశారు.

కాంగ్రెస్ గెలుపు ఖాయం

తలకొండపల్లి: వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ గెలుపు ఖాయమని పీసీసీ కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన మండల కేంద్రంలో మాట్లాడారు. సీఎం కేసీఆర్ ప్రజా సంక్షేమాన్ని అభివృద్ధిని పూర్తిగా విస్మరించారన్నారు. సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ ముందుకు వెళ్తోందన్నారు. ప్రజలను నమ్మించి మోసం చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని తరిమి కొట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. తుక్కుగూడ సభలో ప్రకటించిన 6 గ్యారంటీ స్కీములతో పార్టీకి పూర్వ వైభవం రానుందన్నారు. అధికారంలోకి రాగానే ప్రతి కుటుంబంలోని మహిళకు నెలకు రూ. 2,500 నగదు, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రూ. 500కే వంట గ్యాస్ సిలిండర్, గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం తదితర పథకాలను అమలు చేస్తామన్నారు.

యాచారాన్ని ఆదర్శవంతంగా అభివృద్ధి చేస్తా

ఎంపీపీ కొప్పు సుకన్య



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ తదితరులు

యాచారం: మండల కేంద్రాన్ని ఆదర్శవంతంగా అభివృద్ధి చేస్తానని ఎంపీపీ సుకన్య పేర్కొన్నారు. యాచారం గ్రామ పంచాయతీలో ఆదివారం రూ.30 లక్షల అభివృద్ధి పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా సుకన్య మాట్లాడుతూ గ్రామ సర్పంచ్ ముదిరెడ్డి శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని అన్నారు. యాచారంలోని ఎస్‌బీఐ ముందు కాలనీలో రూ. 50 లక్షల నిధులతో విడతల వారిగా డ్రైనేజీ కాల్వలు నిర్మించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ జంగమ్మ, ఉప సర్పంచ్ గొల్లపల్లి లలిత, వార్డు సభ్యులు నాగరాజు, జయమ్మ, కృష్ణ, శ్రీనువాస్‌రెడ్డి, వెంకటేశ్ పాల్గొన్నారు.

మరోసారి ఆశీర్వదించండి

విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి



బాలాపూర్‌లోని పెద్ద చెరువు సుందరీకరణ పనులను ప్రారంభిస్తున్న మంత్రి సబితారెడ్డి

బడంగ్‌పేట్: అభివృద్ధే ఎజెండాగా నియోజకవర్గాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ సహకారంతో అన్ని రంగాల్లో ముందుకు తీసుకువెళ్తున్న తనను ప్రజలు మరోసారి ఆశీర్వదించాలని విద్యాశాఖమంత్రి సబితారెడ్డి కోరారు. కార్పొరేషన్ పరిధిలోని 11,12,14,10,15,16,20 డివిజన్లలో సుమారు రూ.12.8 కోట్లతో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు ఆదివారం శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. రూ.2 కోట్ల హెచ్‌ఎండీఏ నిధులతో చేపట్టిన బాలాపూర్‌లోని పెద్ద చెరువు సుందరీకరణ పనులను ప్రారంభించి కాసేపు లేక్ అందాలను ఆస్వాదించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ కార్పొరేషన్‌కు ఇచ్చిన రూ.50 కోట్ల నిధుల నుంచి మొదటి విడతగా రూ.12.8 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. కనీస సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు సురభివాణీదేవి, ఎగ్గె మల్లేషం, మేయర్ పారిజాత, డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, కమిషనర్ సుమన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో దేశానికే ఆదర్శం

మీర్‌పేట: సంక్షేమం, అభివృద్ధిలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని మంత్రి సబితారెడ్డి పేర్కొన్నారు. మీర్‌పేట కార్పొరేషన్ పరిధిలోని 14, 34, 37, 46, 44, 23, 25, 26, 27, 11, 08, 09, 10, 38, 17, 41, 42, 43, 19 డివిజన్ల పరిధిలోని కాలనీల్లో రూ.5 కోట్ల 92 లక్షల వ్యయంతో సీసీ, బీటీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీ పనులతో పాటు మంత్రాల చెరువు వద్ద నాయీ బ్రాహ్మణ, ఎరుకల సేవా సంఘం, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్‌లకు సంబంధించి భవన నిర్మాణం పనులకు మంత్రి ఆదివారం శంకుస్థాపనలు (మొత్తం 27 పనులు) చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ల సహకారంతో నియోజకవర్గంలోని రెండు కార్పొరేషన్లను అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. కుల, మతాలకు అతీతంగా అందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్న ఘనత తెలంగాణ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. తెలంగాణలో ఉన్న సంక్షేమ పథకాలు బీజేపీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో లేవని, ప్రజలకు మంచి చేస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వానికి ప్రజలంతా అండగా నిలిచి వచ్చే ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని మంత్రి కోరారు. కార్యక్రమాల్లో మేయర్ ఎం.దుర్గాదీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, కమిషనర్ వాణి, డీఈ గోపీనాథ్, ఏఈ శ్రీనివాసులు, ఎఫ్ఆర్‌ఓ సుధీర్, కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులు, కాలనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

వందల కోట్ల రూపాయలతో అభివృద్ధి

పహాడీషరీఫ్: వందలాది కోట్ల రూపాయల వ్యయంతో మహేశ్వరం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నామని విద్యాశాఖ మంత్రి పి.సబితారెడ్డి అన్నారు. బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మామిడిపల్లి గ్రామం 11వ డివిజన్‌లో రూ.1.20 కోట్ల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ పైప్‌లైన్ పనులకు ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లో కోట్లాది రూపాయలు వెచ్చించి అభివృద్ధి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మేయర్ పారిజాత నర్సింహరెడ్డి, మామిడిపల్లి కార్పొరేటర్లు శివకుమార్, పవన్‌కుమార్ యాదవ్, నాయకులు అఖిల్, వెంకటేష్, విద్యాకమిటీ చైర్మన్ రాజుగౌడ్, జగన్ తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి సబితారెడ్డి తదితరులు

27న ప్రభుత్వ కార్యాలయాలకు శంకుస్థాపన

మహేశ్వరం: మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలు, కోర్టు భవనాలు, కళాశాలు, పాఠశాలల నిర్మాణానికి స్థలాలు లేకపోవడంతో మండల కేంద్రానికి సమీపంలో ఉన్న అసైన్డ్ భూములను సేకరించి ప్రభుత్వం ల్యాండ్ పూలింగ్ స్కీం అమలు చేస్తోంది. మంత్రి సబితారెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని అసైన్డ్ రైతులతో మాట్లాడి భూమికి బదులు గజాల్లో స్థలాలు ఇచ్చేందుకు ఒప్పందం కుదిర్చారు. మండల పరిధిలోని సిరిగిరిపురం గ్రామం రెవెన్యూ సర్వే నంబర్ 88, 89ల్లో సిరిగిరిపురం గేటు వద్ద ఉన్న 11 ఎకరాల అసైన్డ్ భూమిని రైతుల నుంచి ల్యాండ్ పూలింగ్ ద్వారా తీసుకొని ఆ భూమిలో ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఆదివారం మహేశ్వరం, సిరిగిరిపురం గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు ల్యాండ్ పూలింగ్ ద్వారా రైతుల నుంచి తీసుకున్న భూమిని పరిశీలించి జేసీబీ, దోజర్లతో చదును చేశారు. 5 ఎకరాల స్థలంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, 3 ఎకరాల్లో కోర్టు భవనం, 3 ఎకరాల్లో బీఫార్మసీ కాలేజీ భవనాలను నిర్మాణం చేయనున్నారు. ఈ నెల 27న బుధవారం రూ.34 కోట్ల నిధులతో పాలిటెక్నిక్ కళాశాల భవన నిర్మాణానికి మంత్రి చేతుల మీదుగా శంకుస్థాపన చేయనున్నారని స్థానిక బీఆర్ఎస్ నేతలు తెలిపారు.

నేడు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం

కందుకూరు: మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో సోమవారం విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి పలు అభివృద్ధి పనులను ప్రారంభించనున్నట్లు జెడ్పీటీసీ సభ్యుడు బొక్క జంగారెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 9 గంటల నుంచి సరస్వతిగూడ, అగర్‌మియాగూడ, లేమూరు, తిమ్మాపూర్, జబ్బార్‌గూడ, మాదాపూర్, కొలన్‌గూడ, గుమ్మడవెల్లి, రాచులూరు, బైరాగిగూడ గ్రామాల్లో రూ.10.16 కోట్ల నిధులతో చేపట్టిన 59 అభివృద్ధి పనులను వారు ప్రారంభిస్తారని చెప్పారు. ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని ఆయన కోరారు.

సీపీఎం పోరాటంతోనే ఇళ్ల పట్టాలు

పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు రాంచందర్

కందుకూరు: మండల పరిధిలోని నిరుపేదలకు అందిన ఇళ్ల స్థలాల సర్టిఫికెట్లు సీపీఎం పోరాట ఫలితమేనని పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు దుబ్బాక రాంచందర్, మండల కార్యదర్శి బి.శ్రీనివాస్ అన్నారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. 2007 నుంచి నేటి వరకు సీపీఎం పోరాటం చేయడంతో ప్రభుత్వం దిగివచ్చిందని హర్షం వ్యక్తం చేశారు. తమ పార్టీ 16 ఏళ్లుగా ప్రజలకు అండగా నిలబడిందన్నారు. అప్పట్లో పట్టా సర్టిఫికెట్లు పొందిన వారికి ఇవ్వకపోతే ఉద్యమం తప్పదన్నారు. దళిత, బీసీ బంధు నిధులను పేదలకు కాకుండా తమ కార్యకర్తలకే ఇచ్చుకుంటున్నారని ఆరోపించారు. అర్హులకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామన్నారు. వారి వెంట గుడిసెల పోరాట సంఘం అధ్యక్షుడు శేఖర్, కుమార్, ఎ. కుమార్ పాల్గొన్నారు.

సమస్యలన్నీ దశల వారీగా పరిష్కరిస్తా: ఎమ్మెల్యే



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

చంపాపేట: నియోజకవర్గంలోని పలు డివిజన్లలో నెలకున్న ప్రధాన సమస్యలన్నింటినీ ప్రాధాన్యతా క్రమంలో దశల వారీగా పరిష్కరించి ఇతర నియోజకవర్గాలకు ఆదర్శవంతంగా ఎల్బీనగర్‌ను తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మార్నింగ్ వాకింగ్‌లో భాగంగా చంపాపేట డివిజన్ పరిధిలోని పద్మానగర్, ఉదయ్ నగర్, ఎంఆర్ఆర్, సూర్యోదయ కాలనీలో ప్రారంభించి వరదనీటి కాలువ పనులను ఆయన ప్రత్యక్షంగా పరిశీలించారు. అనంతరం సూర్యోదయ కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ...కాలనీలో అభివృద్ధి పనులు చేపడుతున్న సమయంలో తాగునీటి పైపులైన్లు, భూగర్భ డ్రైనేజీ, కాలనీ అంతర్గత రహదారుల విషయంలో కొన్ని ఇబ్బందులు తలెత్తుతాయని కాలనీ వాసులు సంయమనం పాటిస్తూ అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు. వరదనీటి కాలువ పనులు పూర్తైన వెంటనే ఆయా కాలనీలలో విద్యుత్ స్తంభాల ఏర్పాటు, భూగర్భ డ్రైనేజీ, రహదారుల మరమ్మతులను చేపడతామని కాలనీవాసులకు ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు నల్లా రఘుమారెడ్డి, ఓరుగంటి వెంకటేశ్వర్లు, సుంకోజు కృష్ణమాచారి, చీర శ్రీనివాస్, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు ముడుపు రాజిరెడ్డి, తిరుమలేష్, అంజిరెడ్డి, మల్లేష్‌గౌడ్, ఉమామహేష్, జగదీష్‌గౌడ్, చందు, కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధులు నర్సింహ్మా, అనంతరెడ్డి, రమాదేవి, గోకుల సరోజ పాల్గొన్నారు.

29న సామూహిక రాహుకేతు పూజలు

హస్తినాపురం: శ్రీరాజరాజేశ్వరి పీఠం ఆధ్వర్యంలో వేదపండితుడు నవీన్‌శర్మ పర్యవేక్షణలో కొంగరకలాన్‌లోని పీఎస్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో ఈ నెల 29న సామూహిక మహాకాల సర్ప రాహుకేతు సహిత సర్వశాంతి పూజలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా హస్తినాపురం డివిజన్‌లోని భవానీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఆలయ చైర్మన్ ఆర్.బాల్‌రెడ్డి, కార్యక్రమ నిర్వాహకులు సర్వశాంతి పూజల ఆహ్వాన పత్రికను వారు ఆవిష్కరించారు. పూజల్లో పలువురు పీఠాధిపతులు వేదపండితులు పాల్గొంటారని నిర్వాహకులు వెల్లడించారు. కార్యక్రమంలో బి.మోహన్‌రెడ్డి, కొల్లు నర్సింహారెడ్డి, జక్క దామోదర్‌రెడ్డి, జితేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.



ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు భరోసా

- సీఎం సహాయనిధి ప్రజలకు వరం
- పథకం ద్వారా కార్పొరేట్ వైద్యం
- ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

ఆమనగల్లు: అత్యవసర పరిస్థితుల్లో ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందిన పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో భరోసా ఇస్తుందని, ఈ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ కోరారు. సీఎంఆర్‌ఎఫ్ పథకం నిరుపేదలకు వరంలాంటిదని ఆయన అన్నారు. మాడ్గుల మండలం జర్పులతండాకు చెందిన చిట్టికి సీఎంఆర్‌ఎఫ్ ద్వారా రూ.2.50 లక్షలు, అప్పారెడ్డిపల్లి గ్రామానికి చెందిన వెంకటయ్యకు రూ.91 వేలు, ఇర్విన్ గ్రామానికి చెందిన ఇంద్రసేన్‌రెడ్డికి రూ.24 వేలు మంజూరయ్యాయి. ఆదివారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో జరిగిన కార్యక్రమంలో లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. సీఎంఆర్‌ఎఫ్ ద్వారా పేదలకు కార్పొరేట్ వైద్యం అందుతోందని ఎమ్మెల్యే చెప్పారు. అవగాహన లేక పథకాన్ని పలువురు పొందలేకపోతున్నారని, వైద్య ఖర్చులకు సీఎంఆర్‌ఎఫ్ ద్వారా సాయం అందుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కృష్ణారెడ్డి, వెంకటయ్యగౌడ్, జంగయ్యయాదవ్, జైపాల్‌నాయక్, మాడ్గుల మండలం బీఆర్ఎస్ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్



బాలాపూర్ గణనాథుడిని దర్శించుకున్న ఐపీఎస్ అధికారి డీఎస్ చౌహాన్



బడంగ్‌పేట గణనాథుడిని దర్శించుకున్న బీజేపీ రాష్ట్ర నాయకులు

ఆధ్యాత్మిక శోభితం

నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాల్లో నెలకొన్న గణనాథుల మండపాల వద్ద పూజలు కొనసాగుతున్నాయి. అన్నదానాలు, భజనలు, సంస్కృతిక కార్యక్రమాలతో భక్తులు సందడి చేస్తున్నారు. పాడిపంటలతో చల్లగా చూడాలని వినాయకులను వేడుకుంటున్నారు. పలు చోట్ల గణనాథులను ఊరేగించి, నిమజ్జనం చేశారు. -సాక్షి, నెట్‌వర్క్



తుక్కుగూడ: సర్దార్‌నగర్‌లో పూజల్లో పాల్గొన్న భక్తులు



రాంకీలో గణపతి ఊరేగింపు



వినాయకహిల్స్ కాలనీలో పూజలు చేస్తున్న భక్తులు



అమరావతి కాలనీలో చంద్రాయాన్ సక్సెస్ నమూనాలో..



బడంగ్‌పేట: గణేశుడిని సెల్‌ఫోన్‌లో బంధిస్తున్న విదేశీయులు



మీర్‌పేట: పూజలు చేస్తున్న కార్పొరేటర్ ధనలక్ష్మి, జంగయ్యగౌడ్ తదితరులు



మీర్‌పేట: గనాథుడిని నిమజ్జనానికి తీసుకెళ్తున్న భక్తులు



బీష్మానగర్ కాలనీలో..

అభివృద్ధిలో భాగస్వాములు కండి

కడ్తాల్: గ్రామాల అభివృద్ధిలో ప్రజలంతా భాగస్వాములు కావాలని జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ కోరారు. మండలంలోని రావిచేడ్ గ్రామంలో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సహకారంతో మంజూరైన డీఎంఎఫ్ నిధులతో నిర్మిస్తున్న శాలివాహన భవన నిర్మాణ పనులను జెడ్పీటీసీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్ గుప్తా, వైస్ ఎంపీపీ ఆనంద్, రైతుబంధు జిల్లా సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, రైతుబంధు మండల అధ్యక్షుడు వీరయ్య, ఉప సర్పంచ్ వెంకటేశ్, నాయకులు బాలకృష్ణ, రమేశ్‌యాదవ్, విఠలయ్యగౌడ్, పవన్, మల్లేశ్ తదితరులు ఉన్నారు.



భవన నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న దశరథ్‌నాయక్

కళ్లకు గంతలతో అంగన్‌వాడీల నిరసన

ఆమనగల్లు: తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు చేపట్టిన సమ్మె ఆదివారం 14వ రోజుకు చేరుకుంది. ఆమనగల్లు ఎంపీడీఓ కార్యాలయం ఎదుట దీక్షా శిబిరంలో అంగన్‌వాడీలు కళ్లకు గంతలు కట్టుకుని మోకాళ్లపై కూర్చుని నిరసన తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకుడు కురుమయ్య, అంగన్‌వాడీ ఉద్యోగులు అనసూయమ్మ, పద్మ, సంధ్య, అలివేలు, సబిత, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

మంత్రి దిష్టిబొమ్మ దహనం

యాచారం: యాచారం మండల కేంద్రంలో ఆదివారం మంత్రి సత్యవతి రాథోడ్ దిష్టిబొమ్మను అంగన్‌వాడీ సిబ్బంది దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంత్రి సమస్యలు పరిష్కరించకుండా అంగన్‌వాడీ సిబ్బందిని కించపర్చేలా మాట్లాడడం సిగ్గుచేటని అన్నారు. బాధ్యతయుతమైన పదవిలో ఉన్న ఆమె అలా మాట్లాడడం సరైంది కాదని అన్నారు. సమస్యలను పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అంగన్‌వాడీ సిబ్బందికి మద్దతుగా సీఐటీయూ నాయకులు బ్రహ్మయ్య, చందునాయక్ పాల్గొన్నారు.

ప్రభుత్వం స్పందించాలి

మంచాల: అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలపై ప్రభుత్వం స్పందించాలని సీఐటీయూ మండల కన్వీనర్ కృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం మంచాల మండల కార్యాలయం ఎదుట నిర్వహించిన అంగన్‌వాడీ వర్కర్ల దీక్షలో ఆయన పాల్గొన్నారు. కృష్ణ మాట్లాడుతూ అంగన్‌వాడీ వర్కర్ల విషయంలో మంత్రి సత్యవతి రాథోడ్ పొంతన లేని మాటలు మాట్లాడడం సరైంది కాదన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్స్‌అండ్‌హెల్పర్స్‌యూనియన్ నాయకురాలు జ్యోతి, యాదమ్మ, జయమ్మ, సుమతమ్మ, మంగమ్మ, పోచమ్మ, పద్మ పాల్గొన్నారు.



యాచారం: మంత్రి సత్యవతి రాథోడ్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న అంగన్‌వాడీలు